శ్వాసనాళాల వాపుతోనే ఆస్తమా తీవ్రత

ఎన్ఐఎన్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): ముక్కు కండరాల వాపు తీవ్ర శ్వాసకోశ సమస్యలకు దారి తీస్తున్నదని పరిశోధకులు తేల్చారు. ఆస్తమా రోగుల ముక్కు, చాతి నమూనాలను సేకరించి వాటి పనితీరును అంచనా వేసిన పరిశోధకులు, జంతువులకు ఆస్తమా సోకితే ప్రవర్తించే కండరాల పనితీరును కూడా విశ్లేషించారు. మనుషుల్లో కండరాలు వ్యాప్తి చెంది శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుందని, దీర్ఘకాలం తర్వాత ఎన్నటికీ నయం కాని ఆస్తమాగా రూపాంతరం చెందుతుందని గుర్తించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆస్తమా, వ్యాధి కారకాలపై జరిగిన అధ్యయనంలో జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్)కు చెందిన డాక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ సంతోషి ప్రాతినిధ్యం వహించారు. శ్వాసనాళాలు అనూహ్యంగా వాపు చెంది వ్యాధి ప్రాణాంతకంగా మారుతుందని గుర్తించారు. అనూహ్యంగా కండరాలు ప్రతిస్పందించడంతోనే ఆయాసం తీవ్రత పెరుగుతుందన్నారు. ఆస్తమా పేషెంట్ల నుంచి సేకరించిన శాంపిళ్లు, సాధారణ వ్యక్తుల ఊపిరితిత్తుల నమూనాలను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు.

చంచల్‌గూడ జైలుకు బిగ్‌బాస్ విజేత

- 14 రోజుల రిమాండ్ విధింపు
- అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద విధ్వంసం కేసులో 12 మంది నిందితుల అరెస్టు
- రిమాండ్‌ను తిరస్కరించిన జడ్జి
- నలుగురు మైనర్లను జువైనల్ బోర్డు ఎదుట హాజరుపర్చిన పోలీసులు

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్, అతడి సోదరుడు పరశురామ్‌లను చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్/నాంపల్లి కోర్టులు, డిసెంబర్ 21: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద చెలరేగిన విధ్వంసం కేసులో ప్రధాన నిందితుడు బిగ్‌బాస్ విజేత గొడుగు పల్లవి ప్రశాంత్ (26), అతడి సోదరుడు పరశురామ్ అలియాస్ మహావీర్ (24)కు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించడంతో వారిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు వీరిని అరెస్టుచేసి గురువారం తెల్లవారుజామున వైద్య పరీక్షల ఆనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. విధ్వంసం ఘటనలో ప్రశాంత్‌తోపాటు అతడి సోదరుడి ప్రమేయంపై వీడియోలను, ఇతర సాక్ష్యాలను పోలీసులు సమర్పించడంతోపాటు ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం తీరుపై రిమాండ్ రిపోర్ట్‌ను న్యాయయూర్తికి సమర్పించారు. ఏ-1 ప్రశాంత్, ఏ-2 పరశురామ్‌కు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. వారిద్దరినీ గురువారం ఉదయం పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

మరో 12 మంది అరెస్టు.. విడుదల

బిగ్‌బాస్ ఫైనల్స్ రోజున అన్నపూర్ణ స్టూడియోస్ బయట ఆర్టీసీ బస్సులు, పోలీసు వాహనాలను ధ్వంసం చేయడంతోపాటు బిగ్‌బాస్ షో నుంచి బయటకు వస్తున్న పోటీదారులు, యాంకర్ల కార్లను ధ్వంసం చేసిన కేసులో 12 మంది నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరంతా స్టూడియో రహదారి వద్ద బీభత్సం సృష్టించినట్టు సీసీ ఫుటేజీలతోపాటు సోషల్‌మీడియా వీడియోల ద్వారా పోలీసులు గుర్తించారు. మూడురోజులపాటు వివిధ మార్గాల ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో ఇందిరానగర్‌కు చెందిన భూపతి బాలకృష్ణ (28) జీ మోహన్‌కుమార్(28), రంజిత్‌కుమార్ (22) భూపతి రాఘవేందర్ (25), మాలవల గణేశ్ (21), ధర్మపురి రోహిత్ (24), సరళా రాఘవ (23), పీ సురేందర్ (20), ఆర్ నవీన్ (19), ఏ సంతోష్(18), ధర్మపురి యేసురత్నం (20), ఇడుమల్ల మహేశ్ (19) ఉన్నారు. వీరిని 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట గురువారం పోలీసులు హాజరుపర్చగా.. మెజిస్ట్రేట్ సాయిసుధ రిమాండ్‌ను తిరస్కరిస్తూ సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఘటనలో నేరుగా ప్రమేయం ఉన్న మరో నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపర్చారు.

ప్రశాంత్ బెయిల్‌పై వాదనలు పూర్తి

ప్రశాంత్‌తోపాటు సోదరుడి తరపున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై గురువారం వాదనలు పూర్తయ్యాయి. అన్నపూర్ణ స్టూడియోస్ దగ్గర అమర్‌దీప్, ప్రశాంత్ అనుచరుల మధ్య జరిగిన వాగ్వివాదం దాడులకు దారితీసినట్టు పోలీసులు తెలిపారు. ప్రశాంత్ కారు డ్రైవర్ నిందితుడిగా ఉన్నందున ప్రశాంత్‌తోపాటు సోదరుడికి బెయిల్ మంజూరు చేయవద్దని, విధ్వంసానికి వీరిద్దరూ ప్రోత్సహించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. విజేతగా ప్రకటించిన అనంతరం నిందితుడు ప్రశాంత్ కారులోనే ఉన్నాడని, ఎలాంటి గొడవలకు ప్రేరేపించలేదని వారి తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఐదేండ్ల శిక్షకు లోబడి ఉన్న సెక్షన్ల కింద 41-ఏ నోటీసులు జారీ చేయకుండా వారిని అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది.

● యుద్ధట్యాంకర్ల ట్రయల్‌రన్

ఆధునాతన పరిజ్ఞాన యుద్ధ ట్యాంకర్ల ట్రయల్ రన్‌ను గురువారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువులో విజయవంతంగా నిర్వహించారు. ఎద్దుమైలారం ఓడీఎఫ్ జనరల్ మేనేజర్ రత్నప్రసాద్, జేజీఎం సర్జిత్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వేణునాథ్, అంబటి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. - కొండాపూర్

సీఎం ఓఎస్డీగా అజిత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్‌కు (ఐడీఈఎస్)కు చెందిన బీ అజిత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఐదేండ్లకు ఆయన డిప్యూటేషన్‌పై సీఎం రేవంత్ వద్ద విధులు నిర్వర్తిస్తారు. అతను పేరెంట్ క్యాడర్‌లోనే వేతనాలు పొందనున్నారు. ఎస్ఎస్‌బీ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అజిత్‌రెడ్డి పనిచేసినట్టు సమాచారం.

161 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తుల జప్తు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని సాహితీ ఇన్‌ఫ్రాకు చెందిన రూ.161.50 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం తెలిపింది. గతంలో రియల్ ఎస్టేట్ కేసుకు సంబంధించి సాహితీ ఇన్ ఫ్రాతోపాటు సంబంధిత సంస్థలు, ప్రమోటర్ల ఇండ్లు, కార్యాలయాలపై ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. వీటిల్లో డబ్బులు తీసుకొని ప్లాట్లు ఇవ్వలేదని గుర్తించినట్టు తెలిపారు. దశలవారీగా కోట్లాది రూపాయలు వసూలు చేశారని గుర్తించారు. అమీన్‌పూర్‌లో బిల్డింగ్ పేరుతో రూ.89 కోట్లు వసూలు చేయడంతోపాటు మరో రూ.126 కోట్లను వ్యక్తిగతంగా వాడుకొన్నట్లు ఈడీ గుర్తించింది. సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ ఎండీ లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావుకు చెందిన చర, స్థిర ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. కేసు నమోదు చేసింది.

యాదగిరిగుట్ట ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణారావు

- రాజీనామా చేసిన ఈవో గీత

బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణారావు. చిత్రంలో మాజీ ఈవో గీత

యాదగిరిగుట్ట, డిసెంబర్ 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈవో ఎన్ గీతారెడ్డి గురువారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ వెంటనే ఇన్‌చార్జి ఈవోగా దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టారు. గీత 2014 డిసెంబర్ 3న డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2020 ఫిబ్రవరిలో రిటైర్ అయ్యారు. యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఎక్స్‌టెన్షన్‌పై ఏడాదిపాటు ఆమెను ఈవోగా కొనసాగించారు. నూతన ఈవో వచ్చేవరకు కొనసాగేలా అప్పటి ప్రభుత్వం 2021లో ఆమె పదవీ కాలాన్ని పొడిగించింది. సుమారు 9 ఏండ్లపాటు గీతారెడ్డి యాదగిరిగుట్ట ఈవోగా కొనసాగారు. యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణంలో బాధ్యతలు చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వరుసగా తొమ్మిదేండ్లపాటు ఈవోగా కొనసాగిన ఘనత గీతారెడ్డికి దక్కింది. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావుకు ఆలయ అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, మాజీ ఈవో ఎన్ గీత, డీఈవో దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్ పై ఎలక్షన్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుపై 2019లో దాఖలైన ఎలక్షన్ పిటిషన్ (ఈపీ)ని హైకోర్టు కొట్టివేసింది. గజ్వేల్ నుంచి 2018లో కేసీఆర్ ఎన్నిక కావడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన ఈపీపై విచారణ కొనసాగించాల్సిన అనవసరం లేదని పేర్కొంది. కేసీఆర్ ఎన్నికను రద్దు చేయాలంటూ 2019లో సిద్దిపేట జిల్లా మామిడ్యాలకు చెందిన టీ శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో పలు వాస్తవాలను వివరించకుండా గోప్యంగా ఉంచారని పిటిషనర్ ఆరోపించారు. 2018లో జరిగిన ఎన్నికల కాలపరిమితి గడువు ముగిసిన కారణంగా ఎన్నికల పిటిషన్‌పై విచారణ కొనసాగింపు అవసరం లేదని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు.

నల్లగొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రొసీడింగ్స్ కాపీలతో నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన కమిటీ నాయకులు

దళితబంధు యూనిట్లను గ్రౌండింగ్ చేయాలి

- నల్లగొండలో దళితబంధు సాధన కమిటీ నిరసన

నీలగిరి, డిసెంబర్ 21: దళితబంధు పథకం యూనిట్లకు నిధులు విడుదల చేసి గ్రౌండింగ్ చేపట్టాలని దళితబంధు సాధన కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సాధన కమిటీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితబంధు రెండో విడత కోసం నల్లగొండ నియోజకవర్గంలో 1,055 మంది కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు వచ్చినట్టు పేర్కొన్నారు. గ్రౌండింగ్ పూర్తి చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించారని, ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిందన్నారు. కోడ్ ముగిసినా ఇప్పటివరకు గ్రౌండింగ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు ఇవ్వకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కమిటీ నాయకులు పాలడుగు నాగార్జున, బకరం శ్రీనివాస్, కంచనపల్లి విమలమ్మ, అద్దంకి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ చైర్మన్ సోదరుడి హఠాన్మరణం

- ఆరు నెలల్లోనే గుండెపోటుతో అన్నాతమ్ముడి మృతి

జయప్రకాశ్ (ఫైల్)

ములుగురూరల్, డిసెంబర్ 21: ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత కుసుమ జగదీశ్వర్ సోదరుడు కుసుమ జయప్రకాశ్ (50) గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న జయప్రకాశ్‌కు బుధవారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామం మల్లంపల్లికి తరలించి, గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. ములుగు జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్న క్రమంలో కుసుమ జగదీశ్వర్ గత జూన్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆరు నెలలు గడువకముందే జయప్రకాశ్ కూడా గుండెపోటుతోనే మరణించడం బాధాకరం.

చిత్రం

మాస్ జాతరలో 'నా సామి రంగ'

అగ్ర హీరో నాగార్జున నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచమమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆషికా రంగనాథ్ కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యాన్ని అందించారు. ఈ మాస్ గీతంలో నాగార్జునతో పాటు అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ కూడా భాగమవుతున్నారు. 300 మంది డ్యాన్సర్లు పాల్గొంటున్న ఈ గీతం సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుందని, హుషారెత్తించే బీట్‌తో అభిమానులను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కథ, మాటలు: ప్రసన్నకుమార్ బెజవాడ, నిర్మాణ సంస్థ: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్, దర్శకుడు: విజయ్ బిన్ని.

శ్రీలీల

పరీక్షలు మిస్సయ్యాయి!

తెలుగు తారాపథంలోకి ఒక్కసారిగా దూసుకొచ్చింది అందాల భామ శ్రీలీల. అనతికాలంలోనే మంచి స్టార్‌డమ్‌ను సొంతం చేసుకుంది. ఓవైపు వైద్య విద్యను అభ్యసిస్తూనే మరోవైపు సినీ రంగంలో రాణిస్తున్నది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగులో వరుస సినిమాలతో బిజీగా ఉంది. 'గుంటూరు కారం' చిత్రంలో మహేష్‌బాబుతో జోడీ కట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం నుంచి మహేష్‌బాబు-శ్రీలీలపై ఓ డ్యూయెట్ సాంగ్‌ను తెరకెక్కించబోతున్నారు. అయితే ఈ పాట షూటింగ్ కోసం శ్రీలీల ఎంబీబీఎస్ సెమిస్టర్ ఎగ్జామ్స్‌ను వదులుకుందట. సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో తన వల్ల షూటింగ్‌కు ఇబ్బందులు ఎదురు కావొద్దనే ఉద్దేశ్యంతో శ్రీలీల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తొలుత షూటింగ్‌కు విరామమిచ్చి పరీక్షలకు హాజరు కావాలని భావించినా.. ఆ తర్వాత సినిమా కోసం తన మనసు మార్చుకున్నట్లు తెలిసింది. ఈ పాటతో 'గుంటూరు కారం' షూటింగ్ పూర్తికానుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సందీప్‌కిషన్

అతీత శక్తుల భైరవకోన

సందీప్‌కిషన్ హీరోగా వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరు పేరు భైరవకోన'. హాస్య మూవీస్ పతాకంపై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చివరి దశ చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో సందీప్‌కిషన్ చేతిలో మంత్రదండం పట్టుకొని కనిపిస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'భైరవకోనలో జరిగే అనూహ్య ఘటనలు, వాటి వల్ల చోటు చేసుకునే పరిణామాలు ఆద్యంతం ఉత్కంఠను పంచుతాయి. సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ నేపథ్యంలో కథ నడుస్తుంది. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అన్నారు. కావ్యథాపర్, వర్ష బొల్లమ్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: శేఖర్ చంద్ర, సమర్పణ: అనిల్ సుంకర, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.ఐ.ఆనంద్.

రహస్య ఛేదనలో 'డెవిల్'

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ఉపశీర్షిక. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో అభిషేక్ నామా రూపొందిస్తున్నారు. సంయుక్తా మీనన్ కథానాయిక. ఈ నెల 29న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'యు.ఏ' సర్టిఫికెట్ లభించింది. 'పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా కల్యాణ్‌రామ్ వినూత్నమైన పాత్రలో కనిపిస్తారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తాయి. విజువల్ ఎఫెక్ట్స్ మరోస్థాయిలో ఉంటాయి. రహస్య ఛేధనలో గూఢచారికి ఎదురైన సవాళ్లేమిటన్నది ఉత్కంఠను కలిగిస్తుంది. తెలుగు ప్రేక్షకులకు 'డెవిల్' సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: శ్రీకాంత్ విస్సా, నిర్మాత, దర్శకత్వం: అభిషేక్ నామా.

రివర్స్ లవ్‌స్టోరీ కాన్సెప్ట్‌తో..

సూర్య శ్రీనివాస్, శివ బొడ్డు రాజు, జెనిఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఎవాల్ (EVOL)'. రివర్స్ లవ్‌స్టోరీ అనే సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో యోగి వెలగపూడి తెరకెక్కించారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ కథ తయారు చేసుకున్నాం. నేటి యువతకు కనెక్ట్ అయ్యే అంశాలుంటాయి. ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన రహస్య ఒప్పందం వల్ల ఏం జరిగిందన్నది ఆసక్తిని కలిగిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కథ, స్క్రీన్‌ప్లే, లిరిక్స్, నిర్మాత, దర్శకత్వం: రామ్‌యోగి వెలగపూడి.

శివ, రాశి

పోలీసాఫీసర్ పోరాటం

శివ కంఠమనేని, రాశి, నందితాశ్వేత ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'రాఘవ రెడ్డి'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ అయిన రాఘవ రెడ్డి వృత్తిపరంగా ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నాడు? అన్యాయాలను ఏమాత్రం సహించని అతనికి సంఘ విద్రోహక శక్తుల నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురైంది? కటుంబ జీవితంలో అతనికి ఎదురైన సమస్యలేమిటి? అనే ఆసక్తికరమైన అంశాలతో ట్రైలర్‌ను తీర్చిదిద్దారు. ఎమోషనల్, యాక్షన్ అంశాలతో రూపొందించిన చిత్రమిదని, జనవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు.